
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 25 జులై 2023 | 5

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ

అనుమతుల్లేని ఆక్వా సాగుపై కఠిన చర్యలు

ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఆక్వా కల్చర్ చేపల చెరువుల సాగు సంబంధించి అనధికార అనుమతులు జారీ చేస్తున్నట్లు పలు ఫిర్యాదులు ప్రజా ఫిర్యాదుల వేదిక స్పందన కార్యక్రమానికి వస్తున్నాయని వీటిపై తనిఖీ ముమ్మరం చేస్తూ అనుమతులు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలకు ఉపక్రమించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం మత్స్య శాఖ జెడిని ఆదేశించారు. కోనసీమ జిల్లాలో జిల్లాలో మత్స్య శాఖ అనుమతులు పొందకుండా అనధికార ఆక్వా కల్చర్ సాగు ఉల్లంఘనలపై కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పూర్తి పర్యవేక్షణ వ్యవస్థను బలోపేతం చేస్తూ మత్స్యశాఖ సంయుక్త సంచాలకులు క్షేత్రస్థాయిలో అనధికారిక చేపల చెరువుల కట్టడికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశాల్లో కూడా ఆక్వారంగ చెరువుల తవ్వ కాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

చెరువులు కాదు.. రహదారులు..

- బురదమయంగా తాపేశ్వరం రోడ్డు
- ప్రమాదకరంగా రామచంద్రపురం రోడ్డు

ప్రజాశక్తి మండపేట, రామచంద్రపురం

మండపేట-తాపేశ్వరం రోడ్డు పనులు కొద్ది కాలంగా నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒకవైపు సిసి రోడ్డు నిర్మించి రెండోవైపు వదిలేయడంతో పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఈ గోతుల్లో పడి తరచూ వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో స్పందించిన అధికారులు ఎర్ర కంకర పోసి చేతులు దులుపుకున్నారు. నాలుగు రోజుల నుంచి వర్షం విరివిగా కురుస్తున్న నేపథ్యంలో గోతుల్లో నీరు చేరి రోడ్డు అంతా బురదమయంగా మారడంతో వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. పలువురు వాహనదారులు వర్షం కారణంగా జారిపడి గాయాల పాలవుతున్నారు. స్థానిక మెహర్ బాబా ఆశ్రమం వద్ద రోడ్డు చెరువును తలపిస్తోంది. అధికారులు స్పందించి త్వరితగతిన రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతున్నారు. రామచంద్రపురంలో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మెయిన్ రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. ఐదేళ్లుగా పాడైన రోడ్లు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత దారుణంగా దెబ్బతిన్నాయి. దీంతో రాత్రి సమయంలో పలు ప్రమాదాలకు రోడ్లు కారణమవుతున్నాయి. ఐదేళ్ల గా ఈ రోడ్ల ఆధునీకరణకు నోచు కోకపోవడంతో పలువురు బాహాటంగా విమర్శిస్తున్నారు. ముగ్గురు నాయకులు ఉన్న నియోజకవర్గంలో మంత్రి వేణు సొంత నియోజకవర్గంలో రోడ్లన్నీ పూర్తిగా పాడైపోయి ఉన్నాయి. వీటిలో ముఖ్యంగా ద్రాక్షారామ రామచంద్రపురం రోడ్డు, యానాం ద్రాక్షారామ రోడ్డు, వెల్ల ఆదివారం పేట రోడ్డు, శివల దంగేరు మెయిన్ రోడ్డు పూర్తిగా పాడై ప్రతిరోజూ పలు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. ద్రాక్షారామ రామచంద్రపురం రోడ్డుకు సుమారు రూ.15 కోట్లు ముఖ్యమంత్రి ఇచ్చిన ఈ రోడ్డు పనులను మూడు నెలల్లో మంత్రి వేణు అట్టహాసంగా ప్రారంభించారు. అయినా రోడ్డు పనులు నేటికీ ప్రారంభం కాకపోవడంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ద్రాక్షారామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ భీమేశ్వర స్వామి ఆలయం ఉండటంతో రాష్ట్రం నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుండి కూడా ఇక్కడకు నిత్యం వస్తుంటారు ఈ నేపథ్యంలో ఈ అధ్వానంగా ఉన్న రోడ్ల పరిస్థితి ఎప్పటికీ బాగవుతుందోనని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.


మండపేట-తాపేశ్వరం రోడ్డు దుస్థితి


చెరువును తలపిస్తున్న ద్రాక్షారామ రామచంద్రపురం రోడ్డు

స్పందన అర్జీల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-అమలాపురం

ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన సమస్యల పట్ల క్రియాశీలకంగా స్పందించి సంతృప్తికర స్థాయిలో పరిష్కార మార్గాలు చూపాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా జిల్లా స్థాయి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన హాల్లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో సుమారు 165 మంది అర్జీదారుల నుండి విజ్ఞాపనలను జిల్లా కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్.సత్తిబాబు, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎస్.సుధా సాగర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అర్జీని క్షుణ్ణంగా క్షేత్రస్థాయిలో విచారించి ఎప్పటికప్పుడు యాప్లో ఫోటోలతో సహా విచారణ నివేదికను అప్లోడ్ చేస్తూ అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కార మార్గాలు చూపుతూ గడువు దాటిన అర్జీలు లేకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఒకసారి సమర్పించిన అర్జీ మరల రీ ఓపెన్కు ఆస్కారం లేకుండా పరిష్కార మార్గాలు సకాలంలో చూపాలన్నారు. మండల స్థాయిలో అందిన సమస్యలపై వర్చువల్ విధానంలో ఆయా మండల అధికారులతో సంప్రదించి పరిష్కార మార్గాలు చూపారు. ఈ స్పందన కార్యక్రమంలో రెవెన్యూ, భూ సమస్యలు సామాజిక భద్రతా పింఛన్లు, ఆరోగ్య సేవలు, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు దివ్యాంగుల సమస్యలు సమస్యలపై విజ్ఞాపనలు అందాయన్నారు. స్పందన కార్యక్రమంలో మెరుగైన ప్రత్యామ్నాయంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా కూడా అందిన అర్జీలపై పరిష్కార మార్గాలు నిర్దేశిత కాల వ్యవధిలో చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి పద్మశ్రీ రాణి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఎం.దుర్గారావు దొర, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ.పాపారావు, డిపిఒ వి.కృష్ణకుమారి వివిధ శాఖలకు చెందిన అధికారులు తదితరులు పాల్గొన్నారు.


అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు

ప్రజాశక్తి-అమలాపురం

ఉపరితల ఆవర్తనం, రుతుపవన ద్రోణుల ప్రభావంతో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాలో సోమవారం వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. దక్షిణ ఒడిశాకు ఆనుకుని ఒక ఉపరితల ఆవర్తనం బంగాళాఖాతంలో మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడటంతో పాటు నైరుతి రుతుపవనాలు భారీ వర్షాలకు కారణమని తెలుస్తోంది బంగాళాఖాతంలో ఉన్న ఉపరితల ఆవర్తనం వచ్చే 24 గంటల్లో అల్పపీడనంగా మారే అవకాశం ఉందంటున్నారు. ఈ ప్రభావంతో మరో వారం రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందంటున్నారు. జిల్లాల్లో విస్తారంగా వర్షాలు పడతాయని, పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. జిల్లా కేంద్రమైన అమలాపురం పట్టణంలో సోమవారం కురిసిన భారీ వర్షానికి ప్రధాన రహదారులు నీటితో చెరువులను తలపిస్తున్నాయి. పలు కాలనీలు, పల్లపు ప్రాంతాలు జలవిగ్బంధంలో చిక్కుకున్నాయి. మరోవైపు గోదావరి నది ప్రభావంతో లంక గ్రామాలు నీట మునుగుతున్నాయి. ఈ భారీ వర్షాలకు వరద నీరు మరింత పెరిగే అవకాశం ఉంది.


చెరువును తలపిస్తున్న బస్ స్టేషన్ రహదారి

అమలాపురంలో ముఖ్యమంత్రి పర్యటన వాయిదా


ప్రజాశక్తి-అమలాపురం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల మూలంగా ఈ నెల 26వ తేదీ డ్వాక్రా సంఘా లకు సున్నా వడ్డీ రాయితీ నిధులు బటన్ నొక్కి జమ చేయడానికి వస్తున్న ముఖ్యమంత్రి పర్యటన వాయిదా పడి నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ముఖ్యమంత్రి పర్యటన ఎప్పుడు నిర్వహించేదీ తరువాత తెలియజేస్తామని ఆయన తెలిపారు.

జగనన్న సురక్షతో సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-రామచంద్రపురం

జగనన్న సురక్ష కార్యక్రమంలో సమస్యలు పరిష్కారం అవుతున్నాయని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకష్ణ అన్నారు. రామచంద్రపురం పట్టణంలోని జగనన్న సురక్ష కార్యక్రమంలో సోమవారం ఆయన పాల్గొని మాట్లాడారు. జగనన్నకు చెబుదాం అనుసంధానంగా జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు ఉచితంగా పొందేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన జగనన్న సురక్షను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, పలువురు పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


సభలో ప్రసంగిస్తున్న మంత్రి వేణు

చిరస్మరణీయులు డాక్టర్ చల్లా వెంకట్రావు

ప్రజాశక్తి-మండపేట

ప్రజల మనిషి, కమ్యూనిస్టు, రైతు నాయకులు, పేదప్రజల హోమియో వైద్యులు డాక్టర్ చల్లా వెంకట్రావు చిరస్మరణీయులని పలువురు వక్తలు పేర్కొన్నారు. సోమవారం స్థానిక నాళం వారి సత్రంలో చల్లా వెంకట్రావు 15వ వర్ధంతి సందర్భంగా ప్రజా సంఘాలు, కుటుంబ సభ్యులు ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, ప్రముఖ హోమియో వైద్యుడు చల్లా వెంకట్రావు ప్రజల మనిషిగా సమాజాభివృద్ధికి విశేష కృషి చేశారన్నారు. తొలుత వెంకట్రావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నిర్వాహకులు రవికుమార్ మాట్లాడుతూ తీవ్ర సంక్షోభంలో నడుస్తున్న మానవ సమాజాన్ని మెరుగైన స్థితికి మార్చే లక్ష్యంతో వైజ్ఞానిక అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ప్రజా కళాకారులు ప్రేమానందం పాడిన పాటలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డాక్టర్ చల్లా రవికుమార్, డాక్టర్ మెహర్ ప్రసన్న, సాంస్కృతిక వేదిక నాయకులు కట్టా కృష్ణారావు, సిఐటియు, జన విజ్ఞాన వేదిక, ప్రజానాట్యమండలి జాతీయ, రాష్ట్ర నాయకులు బేబీ రాణి, దువ్వా శేషబాబ్జి, బొడ్డు బుల్లబ్బాయి, జి.మురళీధర్, కెవివి.సత్యనారాయణ, ఉపాధ్యాయ, ఉద్యోగ, శ్రామిక సంఘాల నాయకులు మహంతి లక్ష్మణరావు, గండి స్వామిప్రసాద్ పాల్గొన్నారు.


వెంకట్రావుకు నివాళులు అర్పిస్తున్న స్టాలిన్ తదితరులు

ఎంపీ బోస్‌ను కలిసిన టిడిపి నేతలు

ప్రజాశక్తి-రామచంద్రపురం

రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ ఇంటికి టిడిపి రామచంద్రాపురం ఇన్‌ఛార్జి రెడ్డి సుబ్రహ్మణ్యం తదితరులు సోమవారం వెళ్లారు. బోస్ పెద్ద కుమారుడు ఇటీవల గుండెకు స్టంట్ వేయించుకోవడంతో ఆయనను తెలుగుదేశం పార్టీ నాయకులు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కడియాల రాఘవన్, చింతపల్లి వీరభద్రరావు, మేడిశెట్టి సూర్యనారాయణ పరామర్శించిన వారిలో ఉన్నారు.

వరప్రసాద్‌కు చైర్‌పర్సన్ పరామర్శ

ప్రజాశక్తి-మండపేట

సతీవియోగంతో బాధపడుతున్న మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీ వర ప్రకాష్ కుటుంబాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం పరామర్శించారు. ప్రకాశ్ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించిన వారిలో రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సల్మాన్ హుస్సేన్, రాష్ట్ర మైనార్టీ సెల్ కార్యదర్శి షేక్ మౌలానా, నియోజకవర్గ నూరు బాషా సంఘం అధ్యక్షులు షేక్ ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-మండపేట

వైసిపి ప్రభుత్వంతోనే మండపేట పట్టణ అభివృద్ధి సాధ్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రతివాడ నూక దుర్గారాణి అన్నారు. స్థానిక వైయస్సార్ పార్కు సుందరీకరణలో భాగంగా రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న పార్కు అభివృద్ధి, 30వ వార్డులో రోడ్డు నిర్మాణ పనులకు కోఫ్షన్ సభ్యులు రెడ్డి రాజాబాబు, వైసిపి యువ నేత తోట పథ్వీరాజ్, కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణతో కలిసి సోమవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాణి మాట్లాడుతూ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణంతో పార్కు సుందరికరణ, అభివృద్ధి పనులు చేపడుతు న్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ నిర్ణిత గడువులోగా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పోతంశెట్టి ప్రసాద్, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాపిరాజు, ముక్కా దాలయ్య, ఎఇలు కెవివి.సత్యనారాయణ, పవన్, పాల్గొన్నారు.

దిశ చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి -ఐ.పోలవరం

మురమళ్ల గ్రామపంచాయితీ పరిధిలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్లో ఐ.పోలవరం ఎస్ఐ సిహెచ్.రాజేష్ ఆధ్వర్యంలో సోమవారం దిశా యాప్, చట్టాలపై దిశ డిఎస్‌పి సుంకర మురళీమోహన్ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మెన్ సరపు వెంకట రమణ, వైస్ చైర్మెన్ ఆర్.శ్రీనివాస్, హైస్కూల్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు, దిశ ఎస్ఐ ఎస్.కనకదుర్గ, పోలీసులు, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాల బాలాజీ ట్రస్టుకు రూ.50 వేల విరాళం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ శాశ్వత నిత్య అన్నదాన ట్రస్టుకు పోతుకుర్రు (అయినవిల్లి)కు చెందిన చిలువూరి సూర్య నారాయణరాజు వాణి దంపతులు పుల్లాయమ్మ పేరుమీద అన్నదానం జరిపించేందుకు సోమవారం రూ.50,000 విరాళం ఇచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ జి.మాధవి తెలిపారు. దాత దంపతులకు చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ప్రధాన అర్చకులు మద్దాలి తిరుమల సింగరాచార్యులు స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

సమస్యలు పరిష్కరించాలని ఆశాల వినతి

ప్రజాశక్తి-మండపేట

జిల్లావ్యాప్తంగా నాలుగు అర్బన్ సెంటర్ల ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చంద్రమళ్ల పద్మ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న అర్బన్ ఆశా వర్కర్ లందరికీ జనాభా ఎక్కువగా ఉందని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన గైడ్‌లైన్స్ ప్రకారం అర్బన్ ఆశా వర్కర్లకు 2500 జనాభాకి సేవలందించాలన్నారు. ప్రస్తుతం సచివాలయాలు వచ్చిన నేపథ్యంలో ఒక్కొక్కరిని ఒక్కో సచివాలయానికి కేటాయించడం చేయడం దారుణమన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజలకు అందించే సేవలు దూరం అవుతాయన్నారు. ఇప్పటికే ఆశా వర్కర్లకు ఆన్లైన్, రికార్డు పనులు చేయాలని అధికారులు ఒత్తిడి ఉందన్నారు. మండపేట, రామచంద్రపురం, అమలాపురం, ముమ్మడివరం నాలుగు అర్బన్ సెంటర్లలో ఆశా వర్కర్లకి 4000 నుంచి 5000 వరకు జనాభా కలిగి ఉన్నారన్నారు. ఖాళీలను భర్తీ చేసి ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు సంపూర్ణంగా అందేలా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాయకులు సీతారత్నం ఉమాదేవి, మేరీ, భువనేశ్వరి, రమాదేవి, సుజాత, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.


వినతిపత్రం అందిస్తున్న ఆశాలు

ఛాంబర్ ఆఫ్ కామర్స్‌పై ఆరోపణలు అవాస్తవం

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఇటీవల ఛాంబర్ ఆఫ్ కామర్స్‌పై వచ్చిన ఆరోపణలు అవాస్తమని ఛాంబర్ ప్రతినిధులు తెలిపారు. పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సోమవారం వారు మాట్లాడారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రమాణస్వీకారానికి మంత్రి వేణు కొందరిని పిలవకుండా అడ్డుకున్నారని వచ్చిన ఆరోపణంలో వాస్తవం లేదన్నారు. స్థానికంగా అందుబాటులో ఉన్న నాయకులను ప్రమాణ స్వీకారానికి పిలిచామన్నారు. రాజకీయ దురుద్దేశంతో వ్యవహరించలేదని వారు తెలిపారు. దీనిని రాద్ధాంతం చేసి అనవసర రాజకీయాలు చేయవద్దని స్పష్టం చేశారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపారస్తుల్లో వచ్చే సమస్యలు పరిష్కారానికి అందరూ కలిసిమెలిసి ఉండడానికి ఏర్పాటు చేసిందని, దీనికి ఏ రాజకీయ రంగు లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షులు జగన్నాధవర్మ, నల్లమిల్లి చంటి, అధ్యక్షులు కె.తాతారెడ్డి, ఉపాధ్యక్షులు కంచుమర్తి బాబూరావు, కార్యదర్శి పసుపులేటి సత్తిబాబు, సహాయ కార్యదర్శి ఎస్.దుర్గాప్రసాద్, కోశాధికారి మాదాల లక్ష్మీనారాయణ, కె.సురేష్, జాయింట్ ట్రెజరర్ కె.వీరరాఘవులు, శివారెడ్డి పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఛాంబర్ సభ్యులు

'ఎస్‌వి'లో ఆర్.నారాయణ మూర్తి

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

అమలాపురం స్థానిక శ్రీ వెంకటేశ్వరా డిగ్రీ కళాశాలలో సినీనటుడు ఆర్.నారాయణ మూర్తి సోమవారం సందడి చేశారు. ఈ సందర్భంగా ఆయన గేయాలు, వివిధ డైలాగులతో విద్యార్థులను అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.మనోహర్, సేవారత్నా కరాటం ప్రవీణ్, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కె.నరసింహ రావు, ఎమ్‌డి కె.శ్రావణ్ దిలీప్, యాలంగి వరప్రసాద్, ఎం.పార్వతి, సత్యశ్రీ, సునీల్, సూర్యకుమారి, డాక్టర్ కె.హేమావిజిత, విద్యార్థులుపాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

గొల్లవిల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను ఆ పాఠశాలలో సోమవారం ఘనంగా సత్కరించారు. హెచ్‌ఎం ఎల్.రాణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు వై.సత్యశ్రీ, వి.వెంకటేశ్వరరావు, పి.మంజుల, కె.సీతారామయ్య, ఎ.లక్ష్మీ రమణ, వి.అన్నపూర్ణను దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ, ఎంపిటిసి సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, పిఎంసి సభ్యులు మంచెం బాలకృష్ణ, పీడీ గోలకోటి ఫణీంద్ర కుమార్ పాల్గొన్నారు.

కిడ్నీ బాధితునికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-కొత్తపేట

కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధ పడుతున్న కొత్తపేట గ్రామ శివారు చినగూళ్లపాలెం గ్రామానికి చెందిన మామిడిశెట్టి దుర్గాప్రసాద్‌కు ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి రూ.50 వేలు సాయం అందించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులతో ఎంఎల్ఎ మాట్లాడుతూ పార్టీ వారికి ఎప్పుడూ అండగా ఉంటుందని, ఏ కష్టం వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

సీజ్ చేసిన వాహనాల వేలం

ప్రజాశక్తి - ఆలమూరు


జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో దాడుల్లో సీజ్ చేసిన పలు వాహనాలకు సోమవారం వేలం నిర్వహించారు. ఆలమూరు స్టేషన్ పరిధిలో నాటు సారా, నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ కేసుల్లో పట్టుబడిన ఒక కారు, వివిధ రకాల 8 బైకులకు స్టేషన్ వద్ద వేలం నిర్వహించారు. ఇందులో 9 వాహనాలకు రూ.1.93 లక్షలుగా నిర్ణయించి వేలం వేయగా రూ.3,48,600 ఆదాయం సమకూరిందని ఎస్ఇబి ఎస్ఐ పి.రాంబాబు తెలిపారు.

మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మత్తు పదార్థాల విమోచన కార్యక్రమాలపై సోమవారం ఈదరపల్లి రవితేజ జూనియర్ కాలేజ్ అండ్ డిగ్రీ కాలేజ్‌లో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మానసిక వైద్యురాలు డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ నేటి యువత ఫోన్‌లకు బానిసలుగా మారుతూ మత్తు పదార్థాలైన పొగాకు, మద్యం, గంజాయి వంటి చెడు అలవాట్లకు బానిసల వుతున్నారన్నారు. మానసిక ఆందోళనకు గురికావడంతో చదువులో వెనుకబడడం వల్ల కుటుంబంలో అనేక సమస్యలకు దారి తీస్తోందన్నారు. ఒక ప్రణాళికబద్ధమైన జీవితాన్ని జీవిస్తూ వ్యసనాల నుంచి దూరంగా ఉంటూ ఆరోగ్యవంతంగా జీవించాలని సూచించారు. ఎన్‌టిసిపి సోషల్ వర్కర్ ప్రమీల మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల వచ్చే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం, సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జెవికె.నాగేశ్వరరావు, ప్రిన్సిపల్ కె.దొరబాబు, సిబ్బంది పి.శ్రీనివాసరావు, కె.ప్రసాద్, కెవి.బాలకుమార్, డిఎంహెచ్‌పి సైకియాట్రిస్ట్ సోషల్ వర్కర్ సిహెచ్.బాబీ, డి అడిక్షన్ సెంటర్ కౌన్సిలర్ ఎం.శ్రీనుబాబు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



గోదాట్లో కలిసిన జగన్ హామీ

జాషువాకు పలువురి నివాళి

ప్రజాశక్తి-రాజోలు

రాజోలులో సోమవారం దళిత చైతన్య వేదిక ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో మహాకవి గుర్రం జాషువాకు ఆయన వర్ధంతి సందర్భంగా పలువురు ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా దళిత చైతన్య వేదిక నాయకులు మాట్లాడుతూ చీత్కారాలు పొందిన చోటే సత్కారాలు పొందిన మహనీయుడు నవయుగ కవి చక్రవర్తి జాషువా మాత్రమేనన్నారు. జాషువా చేసిన సాహిత్య సేవలకు కేంద్ర సాహిత్య అకాడమీ నుండి పురస్కారాన్ని పొందారని, పద్మభూషణ్, కళా ప్రపూర్ణ, కవి కోకిల, కవితా విశారద వంటి ఎన్నో బిరుదులు అందుకున్నారని తెలిపారు. పద్య సాహిత్యంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చిన జాషువా చిరస్మరణీయుడన్నారు. ఈ కార్యక్రమంలో బత్తుల మురళీకృష్ణ, రాజోలు వైస్ ఎంపిపి పొలమూరి శ్యాంబాబు, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, బత్తుల జనార్ధనరావు, ప్రముఖ అభ్యుదయ వ్యాస రచనల విశ్లేషకులు చిలకపాటి శ్రీధర్, దీపాటి శివప్రసాద్, కాకర విశ్వనాథం, బత్తుల రాజేష్, చింతా మధుకుమార్, సోడదాసు బాబూరావు, శెట్టిబత్తుల విజయ్ కుమార్, మట్టా సురేష్, సరేళ్ల సురేష్, దీపాటి ప్రకాష్, జిల్లెళ్ళ శ్రీనివాస్, చెవ్వాకుల రాము, పాముల హర్షవర్ధన్, మందపాటి మధు పాల్గొన్నారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గ్రామీణ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బివై.కిరణ్ కుమార్ అన్నారు ఆయన సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శుభకార్యాలకు బంధువుల ఇంటికి వెళ్ళినప్పుడు తమ విలువైన వస్తువులను భద్రపరుచుకుని ఈ విషయాన్ని స్థానిక సచివాలయ మహిళా పోలీస్, లేదా స్టేషన్‌లో తెలియపరిస్తే నిఘా ఉంచుతామన్నారు.

కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు

కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకోవడంలోనే మానవత్వం ఉందని మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని చెముడులంకలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన ముత్తాబత్తుల వీర్రాజు, ముత్తాబత్తుల చిన్న కుటుంబాలకు సోమవారం ఒక్కొక్కరికీ రూ.10 వేలు, 25 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను అందజేశారు. మడికికి చెందిన మందపల్లి కళ్యాణ్ (పండు)కు రెండి కిడ్నీలు చెడిపోవడంతో ఆసుపత్రిలో వైద్యం పొందుతూ, ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నాడు. ఆ పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు రూ.35 వేలు రోగి కుటుంబ సభ్యులకు సత్యానందరావు అందజేశారు. రోగి వైద్యం అందుతున్న ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి అన్ని విధాలా తోడుగా ఉంటానని కళ్యాణ్‌కు ధైర్యం చెప్పారు. బండారు వెంట టిడిపి మండల అధ్యక్షుడు మెర్ల గోపాలస్వామి, మాజీ డిసి చైర్మన్ నాగిరెడ్డి వెంకటరత్నం, దొండపాటి సుబ్బరాజు, ఈదల రమేశ్, కొత్తపల్లి కష్ణ, సింహాచలం ఉన్నారు.

నేరాలు ఘోరాలు



బాలుని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

కొత్తపల్లి మండలం కోనపాపేట తీరంలో సముద్ర స్నానానికి దిగి గల్లంతైన బాలుని మృతదేహం సోమవారం ఉదయం కోనపాపేట తీరంలో లభ్యమైంది. సామర్లకోట మండలం పి.వేమవరానికి చెందిన కొంత మంది ఆదివారం లోవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కోనపాపేట వద్ద సముద్రంలో స్నానానికి వెళ్లారు. అలల ఉధృతి అధికంగా ఉండడంతో పసుపులేటి పార్థు(9) గల్లంతయ్యాడు. బాలుని మృతదేహం కోనపాపేట తీరంలో ఒక హ్యచరీ సమీపాన సముద్ర ఒడ్డుకు చేరింది. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.



మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

గ్యాస్ లీకై చెలరేగిన మంటలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక సినిమా సెంటర్‌లో ఒక హోటల్‌లో సోమవారం రాత్రి గ్యాస్ బండ నుంచి గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించటంతో హుటాహుటిని అగ్నిమాపక సిబ్బంది వచ్చి గ్యాస్ మంటలను ఆర్పి వేశారు. వెంటనే మంటలను ఆర్పి వేయడం వల్ల ఎలాంటి నష్టం జరగలేదని అగ్నిమాపక సిబ్బంది తెలిపారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మంది అరెస్ట్

ప్రజాశక్తి - సామర్లకోట రూరల్

సామర్లకోట పట్టణంలో పలు ప్రాంతాలలో పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్‌లో ఎనిమిది మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారని సామర్లకోట సిఐ దుర్గాప్రసాద్ చెప్పారు. ఎస్‌పి ఆదేశాల మేరకు ఎస్‌ఐ చిత్రాడ గోపాలకష్ణ, సిబ్బందితో ఆదివారం రాత్రి ఈ తనిఖీలు చేపట్టారన్నారు. సామర్లకోటకు చెందిన ఎం.హరిబాబు, ప్రదీప్ యాదవ్, ఎం.గోవింద్, పెద్దాపురానికి చెందిన కొర్రిపూరి శ్రీనివాస్,మహేంద్ర శ్యామ్ కిషోర్, రామచంద్రపురానికి చెందిన పువ్వుల ప్రసాద్, జొన్నాడకు చెందిన బందరు దుర్గారావు, ఆర్‌బి.కొత్తూరుకు చెందిన కద్ద సీత రాంబాబులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు. ఒక్కొక్కరికి రూ.10వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్నామని, ప్రజలు, వాహనదారులు, ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా సహకరించాలని సీఐ దుర్గాప్రసాద్ కోరారు.

క్లీనర్ మృతిపై డ్రైవర్ పిర్యాదు

ప్రజాశక్తి - ఆలమూరు

క్లీనర్ మృతి చెందడంతో డ్రైవర్ పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల మేరకు యెనుగుదాటి వరప్రసాద్ లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. భీమవరానికి చెందిన జి.లక్ష్మణరాజు క్లీనర్‌గా ఉన్నాడు. ఈ నెల 23న క్లీనర్‌తో కలిసి వరప్రసాద్ రాజమహేంద్రవరం నుంచి మండలంలోని పెదపల్ల రైస్ మిల్‌కు రైస్ బ్యాగ్స్ లోడ్ కోసం వచ్చారు. లారీకి టార్పాలిన్‌లను ఇద్దరూ కలిసి కడుతున్నారు. లారీపైన ఉన్న క్లీనర్ లక్ష్మణరాజు(45) లారీపైనే కూర్చొని ఆకస్మిక మరణం పొందాడు. ఈ మేరకు డ్రైవరు వరప్రసాద్ సోమవారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

ప్రజాశక్తి -సామర్లకోట రూరల్



గణేష్ కాలనీ బ్రౌన్ పేట్ సెంటర్‌కు చెందిన 12 ఏళ్ల బాలిక అదృశ్యంపై సోమవారం రాత్రి సామర్లకోట పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. సామర్లకోటకు చెదిన గంట గంగాభవాని(12) గణేష్ కాలనీలో షాపు వద్దకు వెళ్లి అనంతరం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులకు చుట్టుపక్కల గాలించారు. ఎంతకీ ఆచూకీ దొరక్కపోవడంతో పాప తండ్రి పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తోట సునీత తెలిపారు. నీలం రంగు డ్రెస్, ఆరెంజ్ కలర్ చున్నీ ధరించిందని తెలిపారు. సరిగా మాట్లాడలేదని, అప్పుడప్పుడూ ఫిట్స్ కూడా వస్తాయని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో గాని లేదా 9440796568, 9701626505 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ ఎతలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నాము. పాపం కోసం గాలింపు చర్యలు చేపట్టామని తెలిపారు.

బిలియర్డ్స్ టోర్నీ విజేత పాండురంగయ్య



ట్రోఫీని అందుకుంటున్న పాండురంగయ్య

ప్రజాశక్తి - కాకినాడ

భారతం లక్ష్మీపతి సోమయాజులు మెమోరియల్ దక్షిణ భారత బిలియర్డ్స్ అండ్ స్నూకర్స్ చాంపియన్ షిప్-2023 విజేతగా రైల్వే స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డ్ సభ్యులు ఇ.పాండురంగయ్య(నెల్లూరు) నిలిచారు. తెలంగాణాకు చెందిన బ్రాండెన్ రన్నరప్‌గా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. ఈ సభకు ముఖ్యఅతిథిగా అర్జున అవార్డ్ గ్రహీత వరల్డ్ బిలియర్డ్స్ చాంపియన్ షిప్ విజేత అశోక్ శాండిల్య హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలను అందించారు. ఆయన మాట్లాడుతూ బిలియర్డ్స్ స్నూకర్స్ పోటీల నిర్వహణ పట్ల హర్షం వ్యక్తం చేశారు. విన్నర్, రన్నర్‌తోపాటూ హైయెస్ట్ స్కోర్ చేసిన క్వాటర్ ఫైనలిస్టు కె.విభాస్ (తెలంగాణా), దిలీప కుమార్(ఆర్ఎస్‌పిబి), నరేష్ జెర్సీ(తెలంగాణా), రఫత్ హబీబ్(తమిళనాడు), సెమీ ఫైనలిస్టులు కె.గిరీష్(ఆర్ఎస్‌పిబి), ఎ.అరవింద్: (ఆర్ఎస్‌పిబి)లకు బహుమతులు అందించారు. అతిపెద్ద ట్రోఫిని ప్రత్యేకించి తయారుచేయించిన హరీష్ స్పోర్ట్స్ అధినేత హరీష్ అందజేసిన ట్రోఫీని విజేత పాండురంగయ్యకు అందించారు. ఈ కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, డాక్టర్ యాతగిరి పరశురామ్, టౌన్ హాల్ కమిటీ అధ్యక్షులు నానాజి, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, కాస్మాపొలిటిన్ క్లబ్ అధ్యక్షులు డాక్టర్ ఎస్‌విఎస్.రావు, టోర్నమెంట్ మేనేజింగ్ కమిటీ లిటరరీ అసోసియేషన్ అధ్యక్షులు జి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యక్షులు జివి, రఘునాథ్, కార్యదర్శి పాబోలు చిన్నపున్నయ్య, కాస్మోపొలిటన్ క్లబ్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్‌విఎస్.రావ్య తదితరులు పాల్గొన్నారు.



కమిషనర్‌కు మొక్కను బహూకరిస్తున్న డిఎఫ్ఒ భరణి

కమిషనర్‌ను కలిసిన డిఎఫ్‌ఒ భరణి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

జిల్లా అటవీశాఖాధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.భరణి సోమవారం కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె గతంలో రంపచోడవరం సబ్ డిఎఫ్ఒగా పనిచేశారు. బదిలీపై ఇక్కడకు వచ్చారు. కమిషనర్‌కు మొక్కను అందించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

జ్యుడీషియల్ విచారణ చేయాలని వినతి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



స్పందనకు వచ్చిన బిసి, ఎస్‌సి సంఘాల నాయకులు, మృతుని కుటుంబ సభ్యులు

కిర్లంపూడి మండలం గోనేడలో నాయీబ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన విద్యార్థిని హత్య కేసుపై జ్యుడీషియల్ విచారణ నిర్వహించాలని, నిందితులను కఠినంగా శిక్షించి, వారికి సహకరిస్తున్న కిర్లంపూడి పోలీస్ అధికారిపై శాఖపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య, బిసి, ఎస్‌సి సంఘాల నాయకులు స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ధన్వంతరి నాయి బ్రాహ్మణ సమాఖ్య అధ్యక్షులు సుందరపల్లి వివిఎస్.గోపాలకృష్ణ మాట్లాడారు. గోనేడకు చెందిన విద్యార్థిని జగ్గంపేట అక్షర కాలేజీ నుంచి కాలేజీ బస్సులో ఇంటికి వచ్చే సమయంలో సెల్‌ఫోన్ చోరీకి గురైందని చెప్పి అతని స్నేహితులే బలవంతంగా తీసుకెళ్లారన్నారు. అనంతరం విద్యార్థి అపస్మారక స్థితిలో యానాం గోదావరి ఒడ్డున పడిఉన్నాడన్నారు. జాలర్లు పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. వైద్యం పొందుతూ మృతి చెందాడన్నారు. దీనిపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు బాధితులు వెళ్ళగా, నిందితులకు వత్తాసు పలుకుతూ స్టేషన్ ఎస్ఐ ఫిర్యాదు తీసుకోకుండా జాప్యం చేశారన్నారు. తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు కలుగజేసుకొని నిందితులను కఠినంగా శిక్షించాలని, నిందితులకు సహకరిస్తున్న పోలీసు అధికారిపై కూడా చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘాల నాయకులు పప్పు దుర్గారమేష్, గుత్తుల రమణ, చొల్లంగి వేణుగోపాల్, దళిత నాయకులు జగడం సత్యనారాయణ, మెలిపాక నాగబాబు, వి.నాని, ఎం.విష్ణు, మహేష్ బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ

అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ భాధితులకు న్యాయం చేయాలని కోరుతూ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం కలెక్టరేట్, జిల్లా పరిషత్ సెంటర్ వద్ద వర్షంలో తడుస్తూ ధర్నా నిర్వహించారు. అనంతరం స్పందనలో వినతిపత్రం అందించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఐ నాయకులు తాటిపాక మధు మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితుల్లో ఉన్న వారందరూ సామాన్య, మధ్యతరగతి ప్రజలేనన్నారు. కాయ కష్టం చేసి దాచుకున్న సొమ్ముకు భద్రత లేకుండా పోయిందన్నారు. వైసిపి ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు భరోసా ఇచ్చి ఎన్నికల్లో గద్దెనెక్కి నాలుగేళ్లయినా నేటికీ న్యాయం చేయలేదన్నారు. 024 ఎన్నికల్లోపు అగ్రిగోల్డ్ బాధితులకు బాండ్ రూపంలో ఉన్న సొమ్మును చెల్లించాలని లేకుంటే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ ధర్నాలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్, యూనియన్ నాయకులు బాలరాజు, అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు వై.నాగలక్ష్మి, వీరమణి, బొమ్మేటి రాంబాబు, కొల్లు శ్రీనివాస్, వైకె.రాజు, శేఖర్, అర్జున్‌రావు పాల్గొన్నారు.

యోగా పోటీల్లో యశ్వంత్‌కి సిల్వర్ మెడల్

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

జెఎన్‌టియుకెలో నేషనల్ యోగా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన యోగా పోటీల్లో బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి కిలాడి యశ్వంత్ సిల్వర్ మెడల్ సాధించారని వ్యాయామ ఉపాధ్యాయులు తాళ్లూరి వైకుంఠం తెలిపారు. వచ్చే నెలలో ఒంగోలులో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్ల యశ్వంత్ పాల్గొంటారన్నారు. ఈ విద్యార్థి యశ్వంత్, వ్యాయామ ఉపాధ్యాయులు వైకుంఠంను మున్సిపల్ చైర్మన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ జాన్‌మోజేష్, పిఎంసి చైర్మన్ చందలాడ శ్రీనివాసరావు, కమిషనర్ జె.రామారావు, హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ తదితరులు అభినందించారు.

సిఎంను కలిసిన దొరబాబు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణం తదితర కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన సిఎం జగన్‌ను ఏపీ స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దవులూరి దొరబాబు కలిశారు. హెలీకాప్టర్‌లో కృష్ణాయపాలెం వద్దకు చేరుకున్న సిఎంకు దొరబాబు పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం సిఆర్‌డిఎ పరిధిలో ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ శాఖ ద్వారా ఇడబ్ల్యూఎస్ లే-అవుట్లలో రూ.1,829.57 కోట్లతో చేపట్టనున్న 50,793 ఇళ్ల నిర్మాణానికి, 45 సామాజిక వసతుల ప్రాజెక్టులకు సిఎం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాల్లో దొరబాబు పాల్గొన్నారు. దొరబాబు మాట్లాడుతూ విపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా అమరావతిలో పేదల ఇళ్ల నిర్మాణానికి సిఎం జగన్ పూనుకోవడం హర్షణీయమన్నారు.

నిర్లక్ష్యాన్ని వీడాలి

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

మండలంలో అచ్చంపేట- గొంచాల గ్రామాల మధ్యలో నిర్మించిన హైవే రహదారికి అప్రోచ్ రోడ్డు నిర్మించకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని, ఫలింగా ఇప్పటి వరకూ జరిగిన ప్రమాదాల్లో ఐదుగురు మరణించారని, ఇప్పటికైనా స్పందించి చర్యలు చేపట్టాలని, లేకుంటే ప్రత్యక్ష ఆందోళన చేపడతామని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి తుమ్మల రామస్వామి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో డిఆర్‌ఒకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సరోజా వాసు, పిట్టా జానకిరామారావు పాల్గొన్నారు.

జగన్ పాలనలో యువశక్తి నిర్వీర్యం

ప్రజాశక్తి - కోటనందూరు

జగన్ పాలనలో యువశక్తి నిర్వీర్యమవుతుందని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు. సోమవారం తేటగుంటలోని టిడిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక్క ఛాన్స్ అంటూ అధికారంలోకొచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల పాల్జేశారన్నారు. నాలుగేళ్లల రూ.11 లక్షల అప్పు చేసి ప్రజలపై పెనుభారాన్ని మోపారన్నారు. ప్రస్తుతానికి మినీ మేనిఫెస్టోను పార్టీ విడుదల చేసిందన్నారు. ఎన్నికల సమయంలో మరో మేనిఫెస్టోను సిద్ధం చేశామన్నారు. ప్రజలందరూ అభివృద్ధి చెందేలా మేనిఫెస్టో ఉంటుందన్నారు. టిడిపితోనే రాష్ట్ర భవిష్యత్తు బాగుపడుతుందన్నారు. యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో టిడిపి రాష్ట్ర ప్రచార ఆర్గనైజర్ యనమల కృష్ణుడు, టిడిపి తుని నియోజకవర్గ ఇన్‌ఛార్జి యనమల దివ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌డిఒ స్పందనకు 12 అర్జీలు

ప్రజాశక్తి- పెద్దాపురం

స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో సోమవారం ఆర్‌డిఒ జె.సీతారామారావు ఆధ్వర్యంలో నిర్వహించిన స్పందనకు 12 అర్జీలు వచ్చాయి. వీటిని పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించామని ఆర్‌డిఒ తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి, మున్సిపల్ మేనేజర్ జ్యోతి రాణి తదితరులు పాల్గొన్నారు.

'పేదల ఆకలిని గుర్తించింది టిడిపియే'

ప్రజాశక్తి - జగ్గంపేట

పేదల ఆకలిని గుర్తించిన పార్టీ టిడిపియేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కాకినాడ రోడ్‌లో గల ఎన్‌టిఆర్ స్మారకమందిరం కాంస్య విగ్రహం వద్ద ప్రతి సోమవారం అన్నా క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కిర్లంపూడి మండల టిడిపి నాయకులు తూము కుమార్ ఆర్థిక సాయంతో భోజనాలను ఏర్పాటు చేసి పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమాన్ని జ్యోతుల ప్రారంభించి మాట్లాడారు. పేదల కోసం టిడిపి ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్లను వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. ఈ ప్రభుత్వానికి కళ్లు తెరిపించేందుకు జగ్గంపేటలో ప్రతి సోమవారం అన్నదానం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టిడిపి కార్యదర్శి ఎస్‌విఎస్.అప్పలరాజు, టిడిపి మండల అధ్యక్షులు మారిశెట్టి భద్రం, వేములకొండ జోగారావు, బోండా రాజేష్, టిడిపి మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎమ్‌డి.కాజా, నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులకు కష్టాలు

ప్రజాశక్తి - జగ్గంపేట



నీటితో నిండిపోయిన సర్వీసు రోడ్డు

అధికారుల నిర్లక్ష్యంతో వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. జగ్గంపేటలోని తుని వైపు వెళ్లే సర్వీస్ రోడ్డులో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో చిన్నపాటి వర్షం వచ్చినా నీరు నిలిచిపోతోంది. పలుమార్లు హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని ప్రజలు వాపోతున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద సర్వీస్ రోడ్డును ఆనుకొని ఉన్న రహదారి కింద భాగాన డ్రెయినేజీ మట్టితో పూడుకుపోయింది. దీంతో వర్షపు నీరు నిలిచిపోతోంది. మోకాళ్ళ లోతుకుపైగా 100 మీటర్ల మేర సర్వీస్ రోడ్డు పొడవునా నీరు ఉండిపోవడంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నేళ్లుగా ఇదే సమస్య ఉన్నా హైవే అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్టు ఉన్నారు. దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా స్పందించట్లేదని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రొఫెసర్ శ్రీనివాసరావుకు డాక్టరేట్

ప్రజాశక్తి - గండేపల్లి

మండలంలోని సూరం పాలెం ఆదిత్య విద్యాసంస్థల్లో హెచ్ అండ్ బిఎస్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డి. శ్రీనివాసరావుకు 'ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రసాదించిందని ఆదిత్య విద్యాసంస్థల వైస్ చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. డాక్టర్ ఆర్.డేవిడ్‌కుమార్ నేతృత్వంలో శ్రీనివాసరావు సమర్పించిన 'స్టడీ ఆఫ్ హీట్ అండ్ మాస్ ట్రాన్సర్ ఆఫ్ సమ్ నాన్ - న్యూటోనియన్ ఫ్లూయిడ్స్' అనే సిద్ధాంత వ్యాసానికి డాక్టరేట్ లభించిందన్నారు. శ్రీనివాసరావు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, క్యాంపస్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్ డోలా సంజయ్, డీన్ ఎ.రామకృష్ణ, విభాగాధిపతి బిఎస్ఎన్.మూర్తి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పి..వేణుగోపాల్ తదితరులు అభినందనలు తెలిపారు.

గొల్లలగుంటలో సచివాలయం, ఆర్‌బికె ప్రారంభం

ప్రజాశక్తి - జగ్గంపేట రూరల్

మండలంలోని గొల్లలగుంటలో నూతనంగా నిర్మించిన సచివాలయం, ఆర్‌బికె భవనాలను ఎంఎల్‌ఎ జ్యోతుల చంటిబాబు సోమవారం ప్రారంభించారు. అనంతరం సచివాలయంలో జగనన్న సురక్ష సభను ఎంపిడిఒ వసంతకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌ఎ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందన్నారు. అనంతరం వైసిపి సేవాదళ్ రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ ఒమ్మి రఘురాం మాట్లాడారు. ప్రభుత్వం ప్రజలకు చిత్తశుద్ధితో అభివద్ధి, సంక్షేమ పథకాలను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అత్తులూరి నాగబాబు, జగ్గంపేట ఉప సర్పంచ్ బండారు రాజా, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - జగ్గంపేట

జగ్గంపేటలో పాత ప్లాస్టిక్ గోనె సంచుల కంపెనీలో తొలగించిన కార్మికులను వెంటనే పనిలోకి తీసుకోవాలని, జీతాల బకాయిలు చెల్లించాలని ఐఎఫ్‌టియు అధ్యక్షులు ఎం.ఏసు డిమాండ్ చేశారు. జగ్గంపేటలోని స్టాలిన్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎలాంటి నోటీసు ఇవ్వకుండా కార్మికులను తొలగించడం అన్యాయమన్నారు. స్థానికులను తొలగించి ఒడిశా వాసులను పనిలో పెట్టుకోవడం సరికాదన్నారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామనానరు. అధికారులను కలిసి చట్టపరమైన పోరాటం చేస్తామని డిమాండ్ చేశారు. న్యూ డెమోక్రసీ డివిజన్ ప్రధాన కార్యదర్శి వి.చిట్టిబాబు ఎఐకెఎంఎస్ జిల్లా కమిటీ సభ్యులు కె.లక్ష్మి, పివైఎల్ జిల్లా అధ్యక్షులు జి.బాలరాజు, దాసరి రత్నం, కొట్టెడ అమ్మాజీ, సత్యవరపు వీరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు శాంతి ర్యాలీ

కాకినాడరూరల్ : జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 25న మంగళవారం మణిపూర్ సంఘటనలపై శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు క్రైస్తవుల పెద్దలు జోసెఫ్ బెన్నీ, శామ్యూల్, సాగర్, రిక్కీ గూటం తెలిపారు. కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట వైద్యనగర్ ఫ్రెండ్స్ కాలనీలో గల బెరాక బ్లెస్సింగ్ చర్చిలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో శాంతి ర్యాలీ వివరాలను వెల్లడించారు. మణిపూర్ హింసలో 249 చర్చిలను కూల్చేశారన్నారు. స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలు, అకృత్యాలకు అనేక మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటిని నిరసిస్తూ శాంతి ర్యాలీ చేపడుతున్నామని తెలిపారు.భానుగుడి జంక్షన్ నుండి కలెక్టర్ కార్యాలయం వరకు ఈ ర్యాలీ జరుగుతుందన్నారు.

యానాం వార్తలు

ఒఎన్‌జిసి పరిహారంపై సర్వే పూర్తి

ప్రజాశక్తి - యానాం

ఒఎన్‌జిసి సంస్థ మత్స్యకారులకు 2022 - 23 సంవత్సరానికి ఇచ్చే నష్టపరిహారానికి సంబంధించి పుదుచ్చేరి ప్రభుత్వం, మత్స్యశాఖ విలేజ్ లెవెల్ కమిటీ నిర్వహించిన సర్వే పూర్తి అయ్యిందని మత్స్యశాఖ సహాయ సంచాలకులు డి.గొంతియ్య సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి గ్రామంలోనూ సర్వే నిర్వహించారన్నారు. అర్హులైన మత్స్యకారుల జాబితాను యానాం గవర్నమెంట్ వెబ్‌సైట్, మత్స్యకార గ్రామ కమ్యూనిటీహాలు, మత్స్య శాఖ కార్యాలయంలోని నోటీసు బోర్డులో ఉంచామన్నారు. అభ్యంతరాలు ఉంటే ఆగస్టు 2లోపు సరైన ఆధారాలతో మత్స్యశాఖ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



గోతిని పూడ్చండి సారూ...

యానాం నల్లచెరువు కాలవతూము వద్ద పైపులైన్ మరమ్మత్తు పనుల కోసం ఇటీవల రోడ్డు మధ్యన గోతిన తవ్వారు. పని పూర్తయినా నేటికీ గోతిని మాత్రం పూడ్చలేదు. మలుపు వద్ద గొయ్యి ఉండటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొంత మంది అదుపుతప్పి పడిపోతున్నారని స్థానికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రోజూ ఇటుగా వస్తున్నా గోతిని మాత్రం పట్టించుకోవట్లేదని వాపోయారు.

ఫోటో, వీడియో గ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

యానాం ఫోటో, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. జనరల్ బాడీ సమావేశం పార్వతీశ్వరమ్మ మినీ ఫంక్షన్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని వర్తక సంఘం అధ్యక్షులు నల్లా వెంకన్న ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షునిగా జెమినీ స్టూడియో అధినేత ఎస్.అహ్మద్ ఎంపికయ్యారు. వైస్ ప్రెసిడెంట్‌గా జె.లోవరాజు, సెక్రటరీగా పెనుగొండ దుర్గబాబు, ట్రెజరర్‌గా మురళీకృష్ణ, జాయింట్ సెక్రెటరీగా ఎస్‌కె.రహీమ్ ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా నల్ల వెంకన్న, ఆరుగురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు తెలిపారు.